క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరినవారితో కేకే మహేందర్ రెడ్డి

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వైట్‌హౌస్‌లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఎంపీటీసీ బైరినేని రాము, నాయకులు వైద్య శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ భీమారం రాధిక భర్త శ్రీనివాస్ కేకే మహేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, యెల్లె లక్ష్మీ నారాయణ, వెల్మల తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన ప్రతాపరామకృష్ణను బీజేపీ మండల నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, జిల్లా నాయకులు పత్తి స్వామి రాజ్, లక్ష్మీపురం రాజుగౌడ్, కృష్ణప్రసాద్, బట్టు రాజు తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

కోనరావుపేట: మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో శనివారం మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికల సంరక్షణ చర్యల గురించి వివరించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాలికలపై లైంగిక వేధింపులు, వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. మహిళా రక్షణ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కో ఆర్డినేటర్ రోజా, దేవిక, అంజలి, ప్రిన్సిపాల్ సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వేములవాడఅర్బన్: పట్టణంలోని 23వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో ప్రజల కనీస అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 20 కోట్లతో అంతర్గత రోడ్లు, మురుగు కాలువ నిర్మాణాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అన్వేశ్, ఏఈ నర్మద, కాలనీవాసులు నక్క బాబు యాదవ్, నాగుల యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పెన్షన్ పెంచాలి

గంభీరావుపేట: బీడీకార్మికులు తాము రాజీనామా చేసిన తర్వాత వచ్చే పెన్షన్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాజీనామా చేసిన బీడీ కార్మికులకు నెలకు రూ.500 నుంచి రూ.వెయ్యి మాత్రమే పింఛన్ వస్తుందని.. దాన్ని రూ.8వేలకు పెంచాలని కోరారు. బీడీ కార్మికుల సౌకర్యార్థం ప్రతి మండలకేంద్రంలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, కార్మికుల పిల్లలకు ఇచ్చే స్కాలర్‌షిప్‌ను పెంచాలని కోరారు. ఈ మేరకు కేంద్ర కార్మికశాఖ మంత్రికి ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపించినట్లు సత్యం తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట: పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని రాచర్లగుండారంకు చెందిన గూడెం రాములు గత 4న మొబైల్ పోగొట్టుకున్నట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ ద్వారా ఫోన్ గుర్తించి శనివారం అప్పగించినట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ

చందుర్తి : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు శనివారం తనిఖీ చేశారు. రికార్డులతో పాటు హాజరుపట్టిక, విద్యార్థుల ప్రగతి నివేదిక రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన గురించి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు విక్రృర్తి లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

శ్రామిక స్ఫూర్తి.. ఆవిష్కరణలతో కీర్తి

- సైన్స్ పరికరాల తయారీలో 'సర్కారు విద్యార్థులు'
- కార్మికుల కష్టాలు తీర్చేలా మిషన్ల తయారీ
- రాష్ట్రీయ, జాతీయస్థాయిల్లో ప్రతిభ
- ఇన్నో వేటర్స్ ప్రయోగాల్లో సక్సెస్

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: అమ్మానాన్నల రెక్కల కష్టం తెలుసుకున్నది ఒకరైతే..బడిలో కార్మికుల శ్రమను ఎరిగింది మరొకరు. ఇద్దరూ సర్కారు పాఠశాలలోమ చదువుతున్న విద్యార్థులే. సైన్స్ పాఠాలను పరీక్షలకే పరిమితం చేయకుండా నిజ జీవితంలో ఉపయోగపడేలా పరికరాలు తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. అమ్మనాన్నలు, గురువుల ప్రోద్బలంతో ఇతర విద్యార్థులకు 'రోల్ మోడల్ ఇన్నోవేటర్స్'గా నిలుస్తున్నారు. నిరుపేద కుటుంబాల్లో పుట్టి ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. జిల్లాలో సర్కారు బడి విద్యార్థుల ఆవిష్కరణలపై సండే స్పెషల్.



హేమంత్ తయారు చేసిన టాకాలు పట్టే మిషన్



అమ్మ స్వరూప, అక్క పూనమ్‌తో హేమంత్

మాది నేత కుటుంబం. సిరిసిల్ల గణేశ్‌నగర్‌లో ఉంటాం. నాన్న జక్కని జ్ఞానేశ్వర్ సాంచాలు నడుపుతూ..అమ్మ స్వరూప బీడీలు చుడుతూ..అక్క పూనమ్, చెల్లె కీర్తితో పాటు నన్ను చదివిస్తున్నారు. నాన్న రెండేళ్ల క్రితం కరోనాతో చనిపోయారు. అప్పటినుంచి అమ్మే మమ్మల్ని చూసుకుంటుంది. చిన్నప్పటి నుంచి నాన్నతో కలిసి సాంచాల కార్ఖానాలో పనిచేస్తూ.. టాకాలు పట్టేటోడిని. ఇంత కఠినమైన పని నాన్న ఎలా చేసేవాడు అని బాధపడేవాడిని. నాన్న దూరమవడంతో టాకాలు పడుతున్న నాకు సాంచాలపై తయారైన బట్టను (టాకాలు) సులువుగా మడతపెట్టేలా మిషన్ తయారు చేయాలనుకున్న. గతేడాది మార్చిలో మిషన్ తయారీ మొదలుపెట్టిన. దాదాపు మూడు నెలలు కష్టపడి పూర్తిచేశా. నా మిషన్ నేత కార్మికులకు బాగా ఉపయోగం కాబట్టి మా సార్లు మోతిలాల్, పాకాల శంకర్‌గౌడ్ నన్ను ప్రోత్సాహించారు. టాకాల మిషన్ పనితీరును ఇన్‌స్పైర్‌లో అప్‌లోడ్ చేశారు. చాలామంది నా మిషన్ పనితీరును మెచ్చుకుంటూ బహుమతులు, ప్రశంసలు అందిస్తున్నారు. అక్క పూనమ్ తొమ్మిదో తరగతి చదువుతుండగా ధాన్యం ఆరబెట్టినప్పుడు హఠాత్తుగా వర్షం పడితే వెంటనే కవర్ కప్పే మిషన్‌ను నాన్న సాయంతో తయారు చేసింది. అయితే అది స్విచ్చాన్ చేయాల్సి వచ్చేది. దానికి మరింత టెక్నాలజీతో ఆటోమెటిక్‌గా పనిచేసే మిషన్‌ను తయారు చేశా. ఇప్పుడు ఉదయం అలారంతో కూడా లేవలేని విద్యార్థుల కోసం ఒక మిషన్ తయారు చేస్తున్నా. మొబైల్, ఒక కాయిన్‌ను అలారం సర్క్యూట్ మిషన్‌పై ఉంచితే ఉదయం లేవాల్సిన సమయానికి ఫోన్ వైబ్రేట్ అయి కాయిన్ మిషన్‌లో ఉంచిన హోల్‌లో పడి..వాటర్ పంపింగ్ అవుతుంది. భవిష్యత్తులో ఎలక్ట్రికల్ విభాగంలో కొత్త పరికరాలు కనిపెడుతాం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే..మరిన్ని ఆవిష్కరణలు చేస్తాను.

వంట కార్మికుల కష్టాలు చూడలేక..

మాది గంభీరావుపేట మండలం దమ్మన్నపేట. అమ్మానాన్నలు పొన్నాల లక్ష్మయ్య, అమ్మ తిరుమల. మాది సన్నకారు రైతు కుటుంబం. ప్రభుత్వ పాఠశాలలో చదివుతున్నా. మధ్యాహ్నం భోజనం నిర్వాహకుల్లో ఎక్కువ మహిళలే ఉంటున్నారు. పాత్రలో బియ్యాన్ని పోసి కడగటం, అన్నం ఉడికాక గంజిని పారపోసేలా 'వంటమిత్ర' మిషన్‌ను తయారు చేశా. నేను తయారు చేసిన సాధనానికి బిగించిన జాకీతో ఎవరి సాయం లేకుండానే బియ్యం కడిగిన నీరు, గంజిని సులువుగా వంచుకోవచ్చు. ఎక్కువ బరువు ఉండనందున ఒక ప్రదేశం నుంచి ఇంకోచోటికి సులువుగా తరలించొచ్చు. జనవరి 2023లో కేరళలో నిర్వహించిన సౌత్ ఇండియా వైజ్ఞానిక ప్రదర్శనలో తృతీయ బహుమతి, పంద్రాగస్టు వేడుకల సందర్భంగా నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో అవార్డు గెలుచుకున్నా. వంట మిత్రను చూసిన చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత తౌటం ప్రత్యేకంగా అభినందించారు. టీ-హబ్‌కు నమూనా తీసుకురావాలని మార్కెటింగ్ చేసుకోవడానికి సహకారమని తెలిపారు. భవిష్యత్తులో ఐఐటీ సీటు సాధించి కొత్త ఆవిష్కరణలు చేయాలన్నదే లక్ష్యం.



అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

రుద్రంగి: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు, అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీలత కోరారు. శనివారం జెడ్పీ హైస్కూల్‌లో బీఎల్‌వోలతో ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు లిస్టులో తప్పులను సరిచేసుకోవాలన్నారు. బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులున్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

ఓటరు నమోదు కార్యక్రమం

ముస్తాబాద్: మండలంలో ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తహసీల్దార్ గణేశ్ తెలిపారు. 45 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు నమోదును చేపట్టారని, జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఆయాపోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండినవారు నమోదు చేసుకోవాలని కోరారు. నాయబ్ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐ శ్యామ్, రఘు, నరేశ్ తదితరులున్నారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థులతో డీఈవో రమేశ్

సిరిసిల్ల ఎడ్యుకేషన్/ముస్తాబాద్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించినట్లు నెహ్రూనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లచ్చయ్య తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో నిర్వహించిన పరీక్షలో పి. ప్రణవి ప్రథమ, వి.హర్షవర్ధన్ ద్వితీయ (ముస్తాబాద్), కె.భావన తృతీయ (లింగన్నపేట) స్థానాల్లో నిలిచారు. తెలుగు మాధ్యమంలో పి. సుస్మిత నేరెళ్ల ప్రథమ (గురుకుల), ఆర్. వైష్ణవి ద మ్మన్నపేట ద్వితీయ (మోడల్ స్కూల్), ఈ.హాసిని నేరెళ్ల తృతీయ (గురుకుల పాఠశాల), స్థానాల్లో ని లిచారు. విజేతలకు జిల్లా విద్యాధికారి రమేశ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు, నగదు అందించారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జై శ్రీరామ్ ముద్ర ఉ న్న జెండాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్యలో సోమవారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఉన్నందున ఇంటింటా జెండాలు అందజేశారు. ప్రతి ఇంటిపై 22న జెండాలు ఎగురవేయాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు రవి, దొంతి అమరేందర్ రెడ్డి, పోతు ఆంజనేయులు, పద్మారెడ్డి, మిర్యాల్‌కర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రవేట్ కళాశాలలు, పాఠశాలలకు ఈనెల 22న సెలవు ప్రకటించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు అన్నారు. అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా 500 ఏళ్ల తర్వాత జరిపే ఈ మహావేడుకను కుటుంబ సమేతంగా జరుపుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించాలని కోరారు. హన్మండ్లు, వివేక్‌రెడ్డి, శేఖర్, రాహుల్, తదితరులున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం



మాట్లాడుతున్న సర్పంచ్

వీర్నపల్లి: మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్ హాజరై మాట్లాడారు. బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు వకుళ, ఎస్ఎంసీ చైర్మన్ జోసెఫ్, ఉపాధ్యాయురాలు నాగరాణి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వేములవాడఅర్బన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. శనివారం సీఐ మాట్లాడుతూ.. ఈనెల 22 తర్వాత అయోధ్య రా మాలయానికి సంబంధించి మొబైల్‌కు వాట్సాప్, మెసేజ్‌లు వస్తే లింక్ ఓపెన్ చేయొద్దన్నారు. దీంతో అకౌంట్లోంచి డబ్బులు కాజేసే అవకాశం ఉందన్నారు.

ఉన్నత చదువుకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న నాయకులు

రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన పీసరి భూమానందం నాలుగు నెలలక్రితం మృతిచెందగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించి మృతుడి కూతురు డిగ్రీ చదివేందుకు అయ్యే ఖర్చులు భరిస్తానని హామీఇచ్చారు. ఈమేరకు రూ.18వేలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పంపించగా ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని సెస్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

• అధికారుల తనిఖీ

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలకేంద్రంలో సేల్స్ టాక్స్ అధికారులు పలు దుకాణాల్లో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న దుకాణ యజమానులు దుకాణాలు మూసివేశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు దుకాణాలు మూసివేశారు. దుకాణాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడ్డారు.

• బాధిత కుటుంబానికి పరామర్శ

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బూడిద సంతోష్ తండ్రి దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణ రెడ్డి పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో జాగృతి మండల అధ్యక్షుడు రామాగౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సద్ది రోజ, తదితరులున్నారు.

• 22న మాంసం దుకాణాలు మూసివేయాలి

ఎల్లారెడ్డిపేట: ఈనెల 22న అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా మండలకేంద్రంలో మాంసం దుకాణాలు మూసివేయాలని సర్పంచ్ వెంకట్‌రెడ్డి కోరారు. పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మరుసటి రోజు నుంచి యథావిధిగా దుకాణాలు నడుపుకోవచ్చన్నారు. ఎవరైనా విక్రయాలు సాగిస్తే జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.

• ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులో శనివారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ మద్యం తాగి రోడ్లపైకి వస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

• సీపీఐ సభ్యత్వ నమోదు

తంగళ్లపల్లి: సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటివేణు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని జిల్లెల్లలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సోమ నాగరాజు, బాచుపల్లి శంకర్, బాలరాజు, శ్రీనివాస్, మల్లయ్య, రాజశేఖర్, చంద్రం, బాలనర్సు, తదితరులు పాల్గొన్నారు.

• అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయండి

తంగళ్లపల్లి: గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ), గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంపీడీవో పి.లచ్చాలు పంచాయతీ ఆదేశించారు. కార్యదర్శులు, మండల వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆ రో గ్యం, ఐసీడీఎస్, సివిల్ సప్లై, పశు సంవర్ధక శా ఖ, ఉపాధిహామీ శాఖలతో కలిసి ప్రణాళిక రూపొందించాలన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి: మండలంలోని ఎర్రగడ్డ తండాకు చెందిన యువకుడు కుటుంబ కలహాలతో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించార

దేవునితండాలో ఉచిత వైద్యశిబిరం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దేవునితండాలో అశ్విని హాస్పిటల్ ఆధ్వర్యంలో శ నివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆ స్పత్రి ఎండీ అభినయ్ పలువురు గ్రామస్తులకు వివిధ పరీక్షలు చేశారు. అవసరమున్న వా రికి ఉచితంగా మందులు అందించారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి అవసరమున్న వారికి కంటి అద్దాలు ఉచితంగా అందించారు. సర్పంచ్, హాస్పిటల్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

చందుర్తి(వేములవాడ): పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని పేరుక కల్యాణ మండపంలో 96 మంది లబ్ధిదారులకు శనివారం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే ప్రభుత్వంపై బురదజల్లే ఆరోపణలు చేస్తున్నారన్నాని, ప్రజలు పట్టించుకోవద్దన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య, సర్పంచ్ సిరికొండ ప్రేమలత, ఎంపీటీసీ సభ్యురాలు పులి రేణుక, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్ రావు, మండల కో ఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రవి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

సిరిసిల్లటౌన్/ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. శనివారం వెంకంపేట ప్రభుత్వ పాఠశాలలో కౌన్సిలర్ కల్లూరి రాజు అందిస్తున్న గోరుముద్ద, గాంధీనగర్ రెయిన్‌బో పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. పదో తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. డీఈవో రమేశ్, ఎంఈవో రఘుపతి, వీరబత్తిని కమలాకర్, రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ నాగుల శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, తదితరులు పాల్గొన్నారు.



గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిందం కళ

యాదవ సంఘం భవన నిర్మాణానికి విరాళం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్లాపూర్ హామ్లెట్ రేగులపల్లి గ్రామ యాదవ సంఘం భవన నిర్మాణానికి దుబాయిలో ఉన్న మల్లాపూర్‌కు చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు వరాల నర్సింగం రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణా రెడ్డి, నర్సింగం మిత్రబృందం సభ్యులు రూ.50వేల నగదును సంఘం నాయకులకు అందించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ వనిత, నాయకులు ఆకుల నాగరాజు, బోయిని ఎల్లేశ్, ఐరెడ్డి రాజ్యలక్ష్మి, వరాల వెంకటేశ్, శివరాం, మహేశ్, బత్తిని సంపత్, నాగుల వంశీ, నిమ్మ వినోద్, దాసరి బాబు, గొర్రె కిషన్, ఏనుగుల కనుకయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



రాజు కుటుంబానికి అండగా నిలవాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన అనుప రాజు ఇటీవ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని శనివారం జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు పరామర్శించారు. రూ10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. రాజు మృతికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య, కుతూరు, కుమారుడు ఉన్నారని, బాధిత కుటుబానికి దాతలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు అందే సుభాశ్, పిల్లి కిషన్, మజీద్ తదితరులున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

పోక్సో కేసులో ఒకరి అరెస్ట్

వేములవాడఅర్బన్: గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన నర్ర విజయ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. మైనర్ బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగ దీసుకున్నడని బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తి..

వేములవాడరూరల్ మండలం నూకలమర్రికి చెందిన లిక్కిడి దేవయ్య కులం పేరుతో దూషించాడని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. గ్రామానికి చెందిన మూడారపు చంద్రయ్య పొలంలో దేవయ్య పశువులు పంటను తిన్నాయి. దీనిపై అడిగిన చంద్రయ్యను కులం పేరుతో దేవ య్య దూషించినందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

శిథిల బడి

- పెచ్చులూడుతున్న పైకప్పు
- భయాందోళనలో విద్యార్థులు
- వంటగది కూలడంతో తరగతి గదిలోనే మధ్యాహ్న భోజనం తయారు



శిథిలావస్థలో బరిగెలగూడెం పాఠశాల

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని బరిగెలగూడెం ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోక ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పైకప్పు పెచ్చులూడుతూ విద్యార్థులపై పడుతోంది. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. వర్షాలు కురిసినప్పుడు ఎప్పుడు కూలుతుందోనన్న భయం విద్యార్థుల్లో నెలకొంది. పాఠశాలలో 26 మంది విద్యార్థులు చదువుతుండగా ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు ఏర్పాటు చేసిన గది కూలి నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో మధ్యాహ్న భోజనాన్ని తరగతి గదిలోనే తయారు చేస్తున్నారు. దీంతో గది గోడలు పొగ చూరుతున్నాయి. పాఠశాల ఆవరణలో చెట్లు ఏపుగా పెరగడంతో నిత్యం కోతుల బెడద తీవ్ర ఉంది. విద్యార్థులను కోతులు వెంబడిస్తున్నాయి. ఆందోళనకు గురవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు చెట్లను తొలగించాలని ఉపాధ్యాయులను కోరుతున్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల పేర్కొన్నారు.



తరగతి గదిలోనే మధ్యాహ్న భోజనం తయారు